సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 27 । మార్చి । 2025



కొల్లేరు.. దారి చూస్తే బేజారు

కొల్లేరు లంక గ్రామాలకు వెళ్లే రహదారులు పూర్తిగా ధ్వంసమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాల బారిన పడుతున్నా నాయకుల్లో చలనం లేదు. 8లో ▸



టీడీపీ నేతల ఆగడాలపై ఫిర్యాదు

టీడీపీ నేతలు తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని.. వేరే ప్రాంతాలకు బదిలీ చేయమంటూ సచివాలయ కార్యదర్శులు మొర పెట్టుకుంటున్నారు. 8లో ▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం (సాయంత్రం)	సహరి శుక్రవారం (ఉదయం)
భీమవరం	6.21	4.41
నరసాపురం	6.22	4.39
తాడేపల్లిగూడెం	6.17	4.50

న్యూస్‌రీల్

కోడిగూడెంలో పారిశుద్ధ్య పనులు



ద్వారకాతిరుమల మండలం కోడిగూడెంలో పాదలను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి స్పందన

ద్వారకాతిరుమల: మండలంలోని కోడిగూడెం గ్రామంలో పారిశుద్ధ్య పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ నెల 24న సాక్షి దినపత్రికలో ।కోడిగూడెంలో సమస్యల తిష్ట। శీర్షికన ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. స్థానిక ఎస్సీ కాలనీలో మురుగుతో నిండిన డ్రైనేజీలను, బోదెలను శుభ్రం చేసి, బ్లీచింగ్ చల్లుతున్నారు. మంగలి పుంత వీధి రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన పాదలను తొలగిస్తున్నారు. బోదెల్లోని తూరల్లో పేరుకున్న చెత్త, చెదారాన్ని తొలగించి, దిగువ ప్రాంతానికి మురుగు పారేలా చర్యలు చేపడుతున్నారు. వీధి లైట్లు లేని ప్రాంతాల్లో లైట్లు కూడా ఏర్పాటు చేస్తామని పంచాయతీ కార్యదర్శి భాస్కర్ తెలిపారు.

ఏపీపీఎస్సీ పరీక్షకు 47 మంది హాజరు

భీమవరం: భీమవరం డీఎన్నార్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఏపీపీఎస్సీ పరీక్షకు 47 మంది హాజరయ్యారని పరీక్షల పర్యవేక్షకుడు సుందర్‌కుమార్ చెప్పారు. ఉదయం పరీక్షకు 100 మందికి 53 మంది గైర్హాజరయ్యారని సుందర్‌కుమార్ తెలిపారు.

ఫ్యాప్టో కార్యవర్గం ఎన్నిక



పి.విజయరామరాజు, ఫ్యాప్టో చైర్మన్

పాలకోడేరు: రాష్ట్ర ఫ్యాప్టో చైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఫ్యాప్టో జిల్లా కార్యవర్గాన్ని బుధవారం భీమవరం ఏఆర్‌కేఆర్ హైస్కూల్‌లో ఎన్నుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా చైర్మన్‌గా పీఎస్ విజయరామరాజు (యూటీఎఫ్), సెక్రటరీ జనరల్‌గా జీ.ప్రకాశం ఎన్నికయ్యారు. డిప్యూటీ సెక్రటరీ జనరల్స్‌గా ఎ.కె.వి రామభద్రం, గుత్తుల శ్రీనివాస్, పీవీఎస్ఎస్‌బీ రమణారావు, కో చైర్మన్‌లుగా పీఆర్‌వీఎస్ సాయి వర్మ, ఎన్.శ్రీనివాసరావు, బి.వి.నారాయణ, కె.వెంకటేశ్వరరావు, కోశాధికారిగా సీహెచ్‌బీ పట్టాభి రామయ్య, సెక్రటరీలుగా ఎం.హరికృష్ణ, జి.మధుసూదనరావు, ఆర్.యరకేశ్వరరావు ఎన్నికయ్యారు.

'పది' పరీక్షకు 97.94 శాతం హాజరు

భీమవరం: టెన్త్ పబ్లిక్ పరీక్షకు 97.94 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ చెప్పారు. బుధవారం భౌతిక శాస్త్ర పరీక్షకు 22,894 మందికి 22,377 మంది హాజరయ్యారన్నారు. ఎస్ఎస్‌సీ(ఏపీఓఎస్ఎస్) సైన్స్ అండ్ టెక్నాలజీ పరీక్షకు 487 మందికి 379 మంది హాజరయ్యారన్నారు. 55 పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు చేయగా ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.

ఇఫ్తార్ విందును బహిష్కరిస్తున్నాం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 27న రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నిర్వహించ తలపెట్టిన ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని అన్ని ముస్లిం సంఘాలు బహిష్కరిస్తున్నాయని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ షరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాలని చూస్తున్న వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థించడాన్ని ముస్లిం సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని స్పష్టం చేశారు. చంద్రబాబుకు ముస్లింల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా రాష్ట్రంలోని ముస్లింల మనోభావాలను గౌరవించి అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహించి వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలన్నారు. లేని పక్షంలో చంద్రబాబు రాష్ట్రంలో ముస్లిం వ్యతిరేకిగా ముద్రపడతారని స్పష్టం చేశారు.

భీమవరం ఏరియా ఆస్పత్రికి క్రిటికల్ కేర్ బ్లాక్ మంజూరు

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ పథకంలో భీమవరం ఏరియా ఆస్పత్రికి క్రిటికల్ కేర్ బ్లాక్ మంజూరయ్యింది. 50 ఐసీయూ బెడ్ల క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటుకు రూ.23.75 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఐదు క్రిటికల్ కేర్ బ్యాక్‌లు మంజూరయ్యాయి. మొత్తంగా రూ.118.75 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

నేడు స్థానిక పోరు

- అత్తిలి, యలమంచిలి ఎంపీపీ పదవులకు ఎన్నిక
- ఏలూరు జిల్లాలో 10 ఉప సర్పంచులు, పశ్చిమగోదావరిలో 15 ఉప సర్పంచులకు ఎన్నిక
- అత్తిలి, యలమంచిలిలో టీడీపీ కుట్ర రాజకీయాలు
- వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలకు ప్రలోభాలే టార్గెట్‌గా రాజకీయం



సాక్షి ప్రతినిధి, ఏలూరు: పల్లె పోరుకు తెరలేచింది... జెంటిల్‌మెన్ ఒప్పందంలో భాగంగా రెండున్నరేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న కొందరు సభ్యులు రాజీనామాతో ఎన్నిక అనివార్యమైంది. ఈ క్రమంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 21న నోటిఫికేషన్ జారీ చేసి 27న ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎన్నిక పూర్తి చేయాలని ఆదేశించడంతో సందడికి తెరలేచింది. ఏలూరు జిల్లాలో 10 ఉప సర్పంచులు, పశ్చిమగోదావరి జిల్లాలో 15 ఉప సర్పంచులు, అత్తిలి, యలమంచిలిలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కోఆప్షన్ సభ్యుల పదవులకు గురువారం ఎన్నికలు జరగనున్నాయి.

అధికార పార్టీ బెదిరింపులు

పంచాయతీల్లో ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీకి పూర్తి మెజార్టీ ఉంది. ఉమ్మడి పశ్చిమగోదావరిలో ఎంపీటీసీలు, జెడ్పీటీసీల్లో 80 శాతానికిపైగా వైఎస్సార్‌సీపీ గెలుచుకుంది. సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులే గెలుపొందారు. ఈ పరిణామాల క్రమంలో అత్తిలి, యలమంచిలి ఎంపీపీ ఎన్నికలు జిల్లాలో ప్రతిష్టాత్మకంగా మారాయి. పార్టీల ప్రాతిపదికన జరిగే ఎన్నిక కావడంతో అధికార పార్టీ అడ్డదారులు తొక్కుతుంది. అత్తిలి, యలమంచిలిలో ఎంపీటీసీలపై బెదిరింపుల పర్వానికి దిగింది. ఎక్కువ మంది ఎంపీటీసీలు లొంగకపోవడంతో వారి వ్యక్తిగత వ్యాపారాలపై దాడులకు దిగి జిల్లాలో చిల్లర రాజకీయాలకు తెరదీశారు. ఇలాంటి పరిణామాల క్రమంలోని అత్తిలి, యలమంచిలి ఎంపీటీసీలు పూర్తిగా వైఎస్సార్‌సీపీతోనే ఉండటంతో పాటు పార్టీ ఎంపీటీసీనే ఎంపీపీగా ఎన్నుకోనున్నారు.

ఎన్నికలు జరిగే స్థానాలివే..

పశ్చిమగోదావరి జిల్లాలో యలమంచిలి, అత్తిలి ఎంపీపీ స్థానాలతో పాటు నర్సాపురం మండలం మల్లవరం, గొంది, భీమవరం మండలం గొల్లవానితిప్ప, గుట్లపాడు, ఎల్‌వీఎన్ పురం, తుందుర్రు, బేతపూడి, అత్తిలి మండలం కేఎస్ గట్టు, మొగల్తూరు మండలం కేపీ పాలెం సౌత్, పేరుపాలెం సౌత్, పాలకొల్లు మండలం అగర్తిపాడు, గోరింటాడ, ఉండి మండలం ఎన్ఆర్‌పీ అగ్రహారం, వీరవాసరం మండలంలో పెరికేపాలెం, యలమంచిలి మండలంలో అబ్బిరాజుపాలెం, ఇరగవరం మండలంలోని కొత్తపాడు, పాలకోడేరు మండలంలో గొరగనమూడి పంచాయతీల్లో ఉపసర్పంచ్‌లు, ఉప ఎంపీపీ, కోఆప్షన్ సభ్యుల పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. ఏలూరు జిల్లాలో ఏలూరు రూరల్, కైకలూరు వైస్ ఎంపీపీ పదవులతో పాటు దెందులూరు మండలంలోని దెందులూరు, పెదవేగి మండలంలో కొండలరావుపాలెం, రామశింగవరం, ముదినేపల్లి మండలంలో పొద్దువాక, చింతలపూడి మండలం రేచర్ల, మండవల్లి మండలంలో ముదుతాళ్ళపూడి, లోకుమూడి, నిడమర్రు మండలం ఎనికేపల్లి, కలిదిండి మండలంలో భాస్కరరావుపేట, కొయ్యలగూడెం మండలంలో అచ్యుతాపురం ఉపసర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

స్థానిక ఎన్నికల్లో రక్షణ కల్పించాలి



ఎస్పీకి ఇచ్చిన వినతిపత్రాన్ని చూపుతున్న వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్, ఏలూరు ఇన్‌చార్జ్ జేపీ

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా కైకలూరు, ఏలూరు రూరల్ మండలాల్లో గురువారం జరిగే వైస్ ఎంపీపీ ఎన్నికకు పోలీసుల రక్షణ కల్పించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు బుధవారం ఎస్పీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ కలిగిన వైఎస్సార్‌సీపీ ఎంపీపీలను ప్రలోభాలకు, భయభ్రాంతులకు గురి చేయడానికి అధికార కూటమి ప్రతినిధులు ప్రయత్నం చేస్తున్నారన్నారు. గురువారం జరిగే ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, దౌర్జన్యాలు జరగకుండా పోలీస్ రక్షణ అవసరమని అన్నారు. ఏలూరు అసెంబ్లీ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్, సిటీ అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయి సుధీర్‌బాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, రాష్ట్ర వాణిజ్య సెల్ కార్యదర్శి భాస్కర్ల బాచి, బీసీ సెల్ టౌన్ అధ్యక్షుడు కిలాడి దుర్గారావు, సిటీ లీగల్ సెల్ అధ్యక్షుడు ప్రత్తిపాటి తంబి పాల్గొన్నారు.

గేట్‌లో ర్యాంకులు గర్వకారణం

ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్



గేట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్ అమరేంద్రకుమార్, ఏఓ లక్ష్మణరావు

నూజివీడు: నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు దాదాపు 200 మంది గేట్–2025 లో మంచి ర్యాంకులు సాధించడం ఆర్జీయూకేటీకి గర్వకారణమని నూజివీడు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ పేర్కొన్నారు. గేట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బుధవారం స్థానిక ట్రిపుల్‌ఐటీలో అభినందన సభ నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. అమరేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రతిభతో పట్టుదలతో ముందుకు సాగితే భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ర్యాంకులు సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. గేట్ 2026లో మరిన్ని ర్యాంకులు సాధించడం ద్వారా ఆర్జీయూకేటీకి మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. హయ్యర్ ఎడ్యుకేషన్ సెల్ ఇన్‌చార్జి రామకృష్ణ మాట్లాడుతూ గేట్ టెస్ట్ సిరీస్‌లను ఆర్జీయూకేటీ విద్యార్థులకు అందించడం వల్ల ర్యాంకులు సాధించడంలో ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ డీన్ శ్రావణి, డీన్ అకడమిక్స్ సాధు చిరంజీవి, ఈఐటీపీ డీన్ పీ శ్యామ్, ఏఓ బీ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పగడాల మృతిపై సరైన దర్యాప్తు జరపాలి



ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న పాస్టర్లు, దళిత జేఏసీ నాయకులు

ఏలూరు (టూటౌన్): బ్రదర్ పగడాల ప్రవీణ్‌ది ముమ్మాటికి హత్యే అని దాన్ని యాక్సిడెంట్‌గా చిత్రీకరించడం దుర్మార్గమని, ఆయన మిస్టరీ మర్డర్‌పై సరైన విచారణ జరిపి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు డిమాండ్ చేసారు. స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్‌లో కొవ్వొత్తులతో బుధవారం రాత్రి నిరసన వ్యక్తం చేసారు. వరప్రసాదరావు మాట్లాడుతూ కొవ్వూరు టోల్‌గేట్ దాటేటప్పుడు సీసీ ఫుటేజ్‌లో బ్రదర్ పగడాల ప్రవీణ్ బాగానే ఉన్నారని టోల్‌గేట్ దాటిన తర్వాత యాక్సిడెంట్ చిత్రీకరించడం దుర్మార్గమని అన్నారు. తక్షణమే దీనిపై ముఖ్యమంత్రి స్పందించి దర్యాప్తును వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల క్రైస్తవులు, దళితులు, చర్చిలపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని క్రైస్తవులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

నేడు పోలవరానికి సీఎం చంద్రబాబు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ, ఎస్పీ

సాక్షి ప్రతినిధి, ఏలూరు/ఏలూరు (మెట్రో)/పోలవరం రూరల్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం పోలవరం ప్రాజెక్టును పరిశీలించనున్నారు. ఉదయం 10 గంటలకు తాడేపల్లిలో బయలుదేరి 10.45 గంటలకు పోలవరంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రాజెక్టు వ్యూ పాయింట్ వద్దకు చేరుకుని ప్రాజెక్టు పనులు పరిశీలిస్తారు. అనంతరం అప్పర్ కాపర్ డ్యామ్, గ్యాప్–1, డయాఫ్రమ్ వాల్, వైబ్రో కంపెక్షన్ తదితర పనులను పరిశీలించి వీఐపీ గ్యాలరీలో ఫోటో ఎగ్జిబిషన్ తిలకిస్తారు. అనంతరం 3 గంటల వరకు నిర్మాణ పనులపై అధికారులతో సమీక్ష చేస్తారు. అనంతరం 3.10 గంటలకు హెలీప్యాడ్ నుంచి బయలుదేరి తాడేపల్లి చేరుకుంటారు. రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్పీ కేపీఎస్ కుమార్, జేసీ పీ.ధాత్రిరెడ్డిలు పోలవరంలో పర్యటన ఏర్పాట్లు పరిశీలించారు.

ఉపాధ్యాయులు, లెక్చరర్ల సమస్యలపై ప్రస్తావన



ఇంటర్ మూల్యాంకన శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో ఉపాధ్యాయులు, లెక్చరర్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను రాష్ట్ర శాసన మండలిలో ప్రస్తావించినట్లు ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి తెలిపారు. స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకన శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఎమ్మెల్సీగా గెలిపించిన లెక్చరర్లకు తొలుత కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్, జూనియర్ లెక్చరర్లకు ప్రిన్స్‌పాల్ పదోన్నతుల్లో జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దామని వివరించారు. కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని, ప్రైవేట్, కళాశాలలు, పాఠశాలల్లో పని చేస్తున్న అధ్యాపక సిబ్బందికి హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరామని తెలిపారు. ఈ సందర్భంగా ఇంటర్ కొత్త కరికులంలో తెలుగును ఆప్షనల్ సబ్జెక్టుగా కాక తప్పనిసరి సబ్జెక్ట్ చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని తెలుగు అధ్యాపకుల సంఘ నాయకులు గోపీమూర్తికి వినతి పత్రం సమర్పించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సంఘ ప్రతినిధులు బీవీ శ్రీనివాస్, భక్త హనుమాన్, రాజకృష్ణ, ఏవీ రాజశేఖర్, ఖాసిం పీరా, ఎం.పేర్రాజు తదితరులున్నారు.

డ్రైవింగ్ టెస్టింగ్ సెంటర్ల ఏర్పాటుకు దరఖాస్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డ్రైవింగ్ టెస్టింగ్ సెంటర్ల ఏర్పాట్ల నిమిత్తం దరఖాస్తుల కోసం కేంద్ర ప్రభుత్వ రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ జనవరి 15న నోటిఫికేషన్ విడుదల చేసిందని ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం డీటీసీ కార్యాలయములో ఆర్టీసీ, వాహన డీలర్లు, డ్రైవింగ్ స్కూల్ యాజమాన్యంతో ఆర్టీవో కృష్ణారావు సమావేశం ఏర్పాటు చేసి సవరించిన పథకాల మార్గదర్శకాలను వారికి వివరించారు. డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్‌ను జిల్లాలో ఏర్పాటు చేసుకోవడానికి సుమారుగా 2 ఎకరాల స్థలాన్ని చూపాలని, 85 శాతం ఆర్థిక సాయాన్ని కేంద్రం అందిస్తుందని అన్నారు. 10 లక్షల జనాభాకు ఒక సెంటర్ కేటాయింపు ఉంటుందని తెలిపారు.

బెట్టింగ్‌తో యువత చిత్తు

- ఆన్‌లైన్ యాప్‌లతో పెరిగిన క్రికెట్ బెట్టింగ్ వ్యసనం
- ఐపీఎల్ సీజన్‌లో జిల్లాలో రూ.కోట్లలో జూదం
- ఈజీ మనీ కోసం జీవితాలను నాశనం చేసుకుంటున్న యువత

జూదాలకు జిల్లా పెట్టింది పేరు. సంక్రాంతి వస్తుందంటే నెల రోజుల ముందు నుంచే కోడి పందేలు, ఏడాది పొడవునా క్లబ్‌లు, చెరువు గట్టులు, గెస్ట్‌హౌసుల్లో గుట్టుచప్పుడు కాకుండా సాగిపోయే పేకాటలు, క్రికెట్ బెట్టింగ్ కార్యకలాపాలు ఇక్కడ షరామామూలే. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ నడుస్తుండటంతో రూ.కోట్లలో బెట్టింగులు జరుగుతున్నట్టు తెలుస్తోంది.



పట్టణానికి చెందిన యువకుడు రూ.2 లక్షల సొమ్మును యాప్‌లో డిపాజిట్ చేసి మంగళవారం రాత్రి ఐపీఎల్ మ్యాచ్‌లో బెట్టింగ్ కాశాడు. చివరి వరకు గెలుపు ఖాయమనుకున్న జట్టు పరాజయం పాలవడంతో రూ.2 లక్షల మొత్తాన్ని పోగొట్టుకున్నాడు. బుధవారం స్థానిక కార్యాలయం వద్ద కొందరు ఈ విషయాన్ని చర్చించుకోవడం కనిపించింది.

రోడ్డున పడుతున్న కుటుంబాలు

జూదాల వలలో పడి ఎంతోమంది నష్టపోతున్నారు. చాలామంది ఆస్తులు పోగొట్టుకుంటే, మనస్తాపంతో ప్రాణాలు తీసుకున్నవారు ఉన్నారు. వ్యసనాలకు బానిసై మరికొంతమంది దొంగలుగా మారి కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు.

- పోడూరు మండలం కవిటంకు చెందిన ఇద్దరు యువకులు బెట్టింగ్, చెడు వ్యసనాలకు బానిసై చోరీల బాట పట్టి మూడు నెలల క్రితం పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి బంగారం, వెండి ఆభరణాలు, మోటారు సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- భీమవరానికి చెందిన యువకుడు వ్యసనాలు, బెట్టింగ్‌ల కోసం చోరీల బాట పట్టాడు. ఇంటి తాళాలు పగలుగొట్టి దొరికిన సొత్తుతో బెట్టింగులు, జల్సాలు చేస్తున్న అతన్ని రెండు నెలల క్రితం పోలీసులు అదుపులోకి తీసుకుని రూ.13.8 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు.



భీమవరంలో పట్టుబడిన బెట్టింగ్ ముఠా (ఫైల్)

- భీమవరంలోని ఒక ఇంట్లో భారీ చోరీకి ప్రణాళిక సిద్ధం చేసుకున్న 12 మంది దోపిడీ దొంగల ముఠాను భీమవరం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వీరిలో పలువురు బెట్టింగ్ రాయుళ్లు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు.

సాక్షి, భీమవరం : భీమవరం, ఉండి, పాలకొల్లు, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల్లో ఉదయం లేవగానే కొందరు కలిసినప్పుడు బెట్టింగుల గురించే మాట్లాడుకుంటున్నారు. నిన్న రాత్రి బెట్టింగ్‌లో ఎవరికెంత వచ్చాయి?, ఎవరెవరు నష్టపోయారన్న దానిపైనే చర్చించుకోవడం కనిపిస్తోంది. జిల్లాలోని కొంతమంది బుకీలు అధికార పార్టీ నేతలతో సంబంధాలు ఏర్పరచుకుని ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో తమ బెట్టింగ్ వ్యవహారాలను మరింత విస్తరించి ముందుకు వెళ్తున్నారు.

అందుబాటులో బెట్టింగ్ యాప్‌లు : పదుల సంఖ్యలో సిమ్ కార్డులు, చుట్టూ సెల్ ఫోన్లు, ఊరూరా కలెక్షన్ ఏజెంట్లు, బుకీలు, తెలిసినవారి సిఫార్సు ఉంటేనే కొత్త వారికి బెట్టింగ్ కాసే వీలు. ఇది ఒకప్పుడు క్రికెట్ బెట్టింగ్ సెటప్. పంటర్లు (బెట్టింగ్ కాసేవారు) ఒకచోట చేరి బుకీలకు ఫోన్లు చేస్తూ బెట్టింగ్ కాసేవారు. తర్వాత యాప్స్ రూపంలో బెట్టింగ్ తీరు మారిపోయింది. ప్లే స్టోర్లలో లభించే యాప్స్ డౌన్‌లోడ్ చేసుకుని వాటికి యూజర్ నేమ్, పాస్‌వర్డ్ ఇచ్చి లాగిన్ కావడం ద్వారా వాటిలో అమౌంట్ డిపాజిట్ చేసి క్రికెట్‌తో పాటు ఇతర జూదాలు ఆడుతున్నారు. ఈజీ మనీకి అలవాటు పడిన కొంతమంది ఐపీఎల్ సీజన్ వచ్చిందంటే బెట్టింగుల్లోనే మునిగిపోతున్నారు. వీరిలో అధికశాతం యువతే ఉండటం ఆందోళన కలిగిస్తున్న అంశం. వీరిని బుకీలు లీడ్ చేస్తుంటారు. మ్యాచ్ ప్రారంభమయ్యే ముందు వాట్సప్ గ్రూప్ పెట్టి బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. బాల్ టు బాల్, ఓవర్ టు ఓవర్ బెట్టింగ్ పెడుతున్నారు. రెండు వారాల క్రితం భీమవరం నరసయ్య అగ్రహారంలోని ఇంట్లో ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురు ముఠా సభ్యులను భీమవరం వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 13 లక్షలు విలువైన 54 మొబైల్ ఫోన్లు, 3 లాప్‌టాప్‌లు, నెట్‌వర్కింగ్ పరికరాలు స్వాధీనం చేసుకున్నారు. వీరంతా 20 నుంచి 25 ఏళ్ల లోపు యువకులే. వీరిలో ఇద్దరు భీమవరానికికు చెందిన వారు కాగా ఒకరిది బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం, మరొకరిది కృష్ణా జిల్లా పెడన.


బుకీలపై పీడీ యాక్టు పెట్టాలి

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో పట్టుబడుతున్న క్రికెట్ బెట్టింగ్ ముఠాల్లో జిల్లాకు చెందిన బుకీలను పోలీసులు గుర్తించారు. బెట్టింగ్ వ్యవహారానికి చెక్ పెట్టాల్సిన పోలీసులు అరెస్టులతో సరిపెడుతుండటంతో వారి వ్యవహారం మూడు ఫోర్లు, ఆరు సిక్సర్లుగా సాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ వ్యవహారం కాక రేపుతుండగా పలుమార్లు అరెస్టయిన బుకీలపై పీడీ యాక్టు కేసు నమోదుచేయడం ద్వారా బెట్టింగ్ కార్యకలాపాలకు బ్రేకు వేయాలని పలువురు అంటున్నారు.

బెట్టింగ్‌ను ఉపేక్షించం

జిల్లాలో బెట్టింగ్ కార్యకలాపాలను ఉపేక్షించేది లేదని పోలీస్ అధికారులు అంటున్నారు. బెట్టింగ్ కట్టడికి ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నట్టు తెలిపారు.

కుటుంబాలు చిధ్రం



బెట్టింగ్ యాప్‌లు నేటి యువతకు వ్యసనంగా మారిపోయాయి. దీనిలో చిక్కుకుంటే సాలెగూడు మాదిరి బయట పడటం చాలా కష్టం. ఎంతోమంది దీనికి బానిసై సర్వం కోల్పోయారు. కొందరు ఆత్మహత్యలు చేసుకున్నారు. బెట్టింగ్ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలి.

– ఉండపల్లి రమేష్‌నాయుడు, న్యాయవాది, భీమవరం

క్లుప్తంగా

సందేశాత్మకంగా అఖిల భారత స్థాయి నాటిక పోటీలు



నాటికలోని సన్నివేశం

వీరవాసరం: వీరవాసరం కళాపరిషత్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అఖిల భారత స్థాయి నాటిక పోటీల 11వ వార్షికోత్సవ ప్రదర్శనలు సందేశాత్మకంగా కొనసాగుతున్నాయి. మొదటి ప్రదర్శనగా సౌజన్య కళా స్రవంతి ఉత్తరాంధ్ర వారి 'దేవరాగం' నాటిక ప్రదర్శనమైంది. రచన దర్శకత్వం కేకేఎల్ స్వామి వహించారు. ద్వితీయ ప్రదర్శనగా చైతన్య కళా స్రవంతి ఉక్కునగరం విశాఖ వారి 'అసత్యం' నాటిక ప్రదర్శించగా రచన పిన్నమనేని మృత్యుంజయ రావు, దర్శకత్వం బాలాజీ నాయక్ వహించారు. నాటక ప్రదర్శనలు ఎంతో ఆసక్తిగా, సందేశాత్మంగా కొనసాగుతున్నాయని నిర్వాహకులు గుండా రామకృష్ణ తెలియజేశారు.

మావుళ్లమ్మ హుండీ ఆదాయం రూ.21 లక్షలు



ఆలయంలో హుండీలు లెక్కిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో బుధవారం హుండీలను లెక్కించారు. 30 రోజుల కాలానికి మొత్తం ఆదాయం రూ.21,06,063, బంగారం 38.500 గ్రాములు, వెండి 120 గ్రాములు, పలు దేశాల విదేశీ కరెన్సీ వచ్చినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణదికారి బుద్ధ మహాలక్ష్మి నగేష్, ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ, తనిఖీదారులుగా వి వెంకటేశ్వరరావు, ఈఓ దండు కృష్ణంరాజు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో అటెండర్ మృతి

జంగారెడ్డిగూడెం : స్థానిక ఆర్డీవో కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న నూగంటి పోలారావు (58) అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ఎస్సై షేక్ జబీర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక బాపూజీనగర్‌లో నివాసం ఉంటున్న నూగంటి పోలారావు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ విధులకు వెళ్లడం లేదు. భార్య చనిపోవడం, పిల్లలు ఇతర ప్రాంతాల్లో ఉండటంతో ఒక్కడే ఒంటరిగా ఉంటున్నాడు. బుధవారం పోలారావు ఉంటున్న ఇంటి నుంచి దుర్వాసన వస్తోందని చుట్టుపక్కల వారు స్థానిక వీఆర్వో శ్రీనుబాబుకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వెళ్లిన వీఆర్వో శ్రీనుబాబు కుళ్లిన దశలో ఉన్న పోలారావు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలారావు మృతదేహం వద్ద పురుగుమందు, కూల్‌డ్రింక్ సీసా ఉంది. దీంతో పోలారావు ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. వీఆర్వో ఫిర్యాదుతో అనుమానాస్పద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని రైలు ఢీకొని..

భీమవరం: గుర్తుతెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం భీమవరం మండలం నర్సింహపురం గ్రామానికి చెందిన ముంజు విశ్వేశ్వరరావు(30) బుధవారం ఉదయం బహిర్భూమికి వెళ్లి తిరిగి వస్తుండగా ఉండి వైపు నుంచి భీమవరం వస్తున్న రైలు ఢీకొని మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, రైటర్ రాజబాబు ఘటనా ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై సుబ్రహ్మణ్యం చెప్పారు.









కొల్లేరు గ్రామాల ప్రధాన రహదారి గోతులతో అధ్వానంగా ఉన్న దృశ్యం

కొల్లేరు.. దారి చూస్తే బేజారు

సంక్రాంతి నాటికి రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు ఉంటాయని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించినా క్షేత్ర స్థాయిలో మాత్రం పనులు పూర్తిచేయడంలో విఫలమైంది. పండుగ దాటి రెండు నెలలు గడిచినా ఇప్పటికీ కొల్లేరులోని లంక గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టలేదు. ఏలూరు మండలం మాధవాపురం నుంచి కొల్లేరు గ్రామం గుడివాకలంక వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమై ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద పెద్ద గోతుల్లో జారిపడి తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నా నాయకుల్లో చలనం లేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు



పాస్టర్ ప్రవీణ్ మరణంపై విచారణ జరపాలి



ఏపీ పాస్టర్స్ ఫెలోషిప్ నాయకుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

భీమవరం: రాజమహేంద్రవరంలో క్రైస్తవ నాయకుడు ప్రవీణ్ పగడాల ఆకస్మిక మరణం క్రైస్తవ లోకానికి విషాదకరమని ఏపీ పాస్టర్స్ ఫెలోషిప్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిది జాన్సన్ అన్నారు. బుధవారం భీమవరంలో వెస్ట్ గోదావరి పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేసి క్రైస్తవులకు తగిన న్యాయం చేయాలని కోరారు. ఫెలోషిప్ జిల్లా సెక్రటరీ బిషప్ జొహనాస్ ప్రేమ్‌మార్, కోశాధికారి రాపాక రత్నరాజు, యూపీఏ భీమవరం ప్రెసిడెంట్ ఆర్ ప్రభాకరరావు, శ్యాంబాబు, ఏలూరి జాన్ మోజేస్ తదితరులు పాల్గొన్నారు.

దళిత ఐక్యవేదిక ధర్నా

ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయవిచారణ జరిపించాలని దళిత ఐక్యవేదిక డిమాండ్ చేసింది. వేదిక ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మరణంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, కొంతకాలంగా ఆయన్ను చంపేస్తామని కొన్ని శక్తులు బెదిరింపు చర్యలకు పాల్పడ్డాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.

మాతా, శిశు సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలి



వేల్పూరు పీహెచ్‌సీలో వైద్యవర్గాలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయ్

తణుకు అర్బన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాతాశిశు సంరక్షణకు అధిక ప్రాధాన్యమివ్వాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జి.గీతాబాయ్ అన్నారు. ముఖ్యంగా ప్రసూతి సేవల్లో వైద్యులు, సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. తణుకు నియోజకవర్గంలోని వేల్పూరు, ఇరగవరం పీహెచ్‌సీలతోపాటు తణుకు ఎన్జీవో కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్, పలు ప్రైవేటు ఆస్పత్రులను బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గీతాబాయ్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వైద్యసిబ్బంది హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని, రక్తహీనత లేకుండా చూసి వారికి సమీపంలోని గైనకాలజిస్టులకు చూపిస్తూ సాఫీగా ప్రసవం జరిగేలా కృషిచేయాలన్నారు. ఓపీ విభాగంలో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు ద్వారా చికిత్స అందించాలని, ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా వైద్యసేవల్లో లబ్ధిదారులకు ఆర్థికభారం పడకుండా సేవలందేలా చూడాలని చెప్పారు. అనంతరం పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు డీఎంహెచ్‌వో తనిఖీలు నిర్వహించడంతో తణుకులోని ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యవర్గాలు అప్రమత్తమయ్యాయి.

శ్రీవారికి 4.32 ఎకరాల పొలం విరాళం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారికి హైదరాబాద్‌కు చెందిన కాకుమాను కోటేశ్వరరావు అనే భక్తుడు 4.32 ఎకరాల (కోకో, కొబ్బరి) పొలాన్ని బుధవారం విరాళంగా అందజేశారు. ద్వారకాతిరుమల మండలం సత్తెన్నగూడెం గ్రామ రెవెన్యూ పరిధిలోని ఆర్ఎస్ నెంబర్ 38/1లో ఉన్న ఈ పొలాన్ని శ్రీవారి పేరున భీమడోలు సబ్ రిజిస్టార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించి, ఆ పత్రాలను ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తికి అందజేశారు. దాతకు ఈఓ చినవెంకన్న చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, లీగల్ సెక్షన్ ఆర్.హనుమంతాచార్యులు ఉన్నారు.

టీడీపీ నేతల ఆగడాలపై ఫిర్యాదు

- ఎంపీడీఓకి ఫిర్యాదు చేసిన సచివాలయ ఉద్యోగులు
- విధులకు ఆటంకం కలిగిస్తూ దుర్భాషలాడుతున్నారని ఆవేదన
- తమను బదిలీ చేయాలంటూ వినతి



ఎంపీడీఓకు ఎ.గోకవరం సచివాలయ ఉద్యోగుల ఫిర్యాదు

ఉంగుటూరు: టీడీపీ నేతలు తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని.. ఇక్కడ తాము పనిచేయలేమని.. వేరే ప్రాంతాలకు బదిలీ చేయండి సార్ అంటూ సచివాలయ కార్యదర్శులు ఎంపీడీఓకు మొర పెట్టుకున్నారు. ఎ.గోకవరం సచివాలయ కార్యదర్శి కుసుమ, ఇతర ఉద్యోగులు బుధవారం మూకుమ్మడిగా ఎంపీడీఓ మనోజ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. గ్రామంలో టీడీపీ నాయకులు తమను అనవసరంగా దుర్భాషలాడుతున్నారని, కార్యకలాపాలకు అడ్డుతగులుతున్నారని కార్యదర్శి కుసుమ ఎంపీడీఓ వద్ద కన్నీరు పెట్టుకున్నారు. ఇదే గ్రామంలో తాము ఉద్యోగం చేయాలంటే పోలీసులు సహాయం ఏర్పాటు చేయాలని లేదంటే తమని వేరే గ్రామానికి బదిలీ చేయాలని కోరారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానికి ఎంపీడీఓ వారికి హామీ ఇచ్చారు. కార్యదర్శిని ఎంపీడీఓ కార్యాలయంలో అదనపు వర్క్ చేయమని ఆదేశించగా, మిగిలిన ఉద్యోగులు విధులకు హాజరుకాబోమని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గోకవరం పంచాయతీలో విధులు నిర్వర్తించలేమంటూ ఇప్పటికీ నలుగురు కార్యదర్శులు వేరే చోటకు బదిలీపై వెళ్లిపోయారంటే పరిస్థితికి అద్దం పడుతోంది. గ్రామ సర్పంచ్ మిద్దే సత్యవతి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరురాలు కావడంతో కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. సర్పంచ్‌కు సహకరించే ఉద్యోగులపై ప్రతాపం చూపుతున్నారు. కూటమి నేతల వేధింపులపై ఉంగుటూరు పర్యటనకు వచ్చిన సీఈఓ భీమేశ్వరరావు దృష్టికి ఎంపీడీఓ తీసుకువెళ్లారు. సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని ఆయన అన్నారు.

పోక్సో కేసు నమోదు

ఉండి: కుటుంబ సభ్యుడిలా నమ్మించి చివరకు బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గణపవరం గ్రామానికి చెందిన పూర్ణి గోపీ ఉండి శివారు పులిగుమ్మ ప్రాంతంలోని ఆక్వా చెరువులపై పనిచేస్తున్నాడు. అదే ప్రాంతంలో పనిచేస్తున్న ఓ వ్యక్తితో స్నేహంగా ఉంటూ అతని కుటుంబంతో సైతం సన్నిహితంగా మెలిగేవాడు. దీంతో ఉండి శివారు గ్రామంలో ఉంటున్న ఆ ఇంటికి తరచుగా వెళ్లేవాడు. ఈ నెల 17వ తేదీన ఆ ఇంట్లోని బాలికకు దుస్తులు కొనేందుకు తీసుకువెళతానని ఆమె తండ్రితో చెప్పి తన ద్విచక్రవాహనంపై పులిగుమ్మ ప్రాంతంలోని చెరువుల వద్దకు బాలికను తీసుకువెళ్లాడు. అక్కడే ఉన్న ఓ షెడ్డులోనికి ఆమెను తీసుకువెళ్లి అసభ్యంగా ప్రవర్తించి ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడు. బాలిక ఇంటికి రాగానే విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్సై శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా బుధవారం కోలమూరు గ్రామంలోని వినాయకుడి గుడివద్ద నిందితుడు గోపీని అదుపులోకి తీసుకుని కోర్టుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.







క్లుప్తంగా

ధ్యానంతో మానసిక ఉల్లాసం



తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో ధ్యానంపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో బుధవారం విపసనా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ధ్యానం చేయడం వలన మనసులో పదును పెరుగుతుందని, ఏకాగ్రత సిద్ధిస్తుందని సబరీనా, మోహన్‌రాజ్, హరీష్, ఉజ్వల బృందం విద్యార్థులకు సూచించారు. విద్యాభ్యాసంలో ఏకాగ్రత ముఖ్యమని, భయం, ఆందోళన, కంగారు, మానసిక ఒత్తుడులు దూరం చేసుకోవచ్చని చెప్పారు. చెడు వ్యసనాలను పోగొట్టుకోవడానికి కూడా ధ్యానం ఉపయోగపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, ప్రిన్సిపాల్ యు.సుందరీబాయ్, బీహెచ్ హిమబిందు, వి.సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక యాగర్లపల్లి ప్రేమాలయం నిరాశ్రయుల వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బుధవారం ఎయిర్‌స్ట్రిప్ మహిళా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ వనచర్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో పేద వృద్ధులకు దుప్పట్లు, చీరలు, దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. వక్తలు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి నిరుపేదలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.కనక దుర్గ, డి.వెంకటలక్ష్మి, వి.ఎస్.ప్రసాద్, కె.రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నజీరుద్దీన్‌కు అభినందనలు



వర్ధమాన గాయకుడు నజీరుద్దీన్

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక వీకర్స్‌కాలనీకి చెందిన ఘంటసాల గాన సభ ఖాసీం తనయుడు, వర్ధమాన గాయకుడు నజీరుద్దీన్ అమెరికాలో ఫిలాడెల్ఫియాకు ఈ నెల 28వ తేదీన జరిగే థమన్ కచేరిలో పాటలు పాడేందుకు వెళ్లుతున్న సందర్భంగా బుధవారం పట్టణంలో నజీరుద్దీన్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. అభినందనలు తెలిపిన వారిలో అంతర్జాతీయ మహిళా శిల్పి దేవికారాణి ఉడయార్, బీవీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు, నర్తకులు వెంకన్న, జంగా బాలాజీ, పౌరాణికి నటులు షణ్ముకి జయ, సరిమేళ్ల పెద్దిరాజు, మాలతి మాధవన్, కళాకారులు, సాహితీ సభ్యులు అభినందించారు.

షాదీఖానాలో ప్రత్యేక ప్రార్థనలు



షాదీఖానాలో సర్వమత ప్రార్థనలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మస్జీద్ హన్ఫియా షాదీఖానాలో జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో బుధవారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ రఫీ రంజాన్ నెల ప్రాముఖ్యతను, ఇస్లాం ధర్మం, ఖురాన్ విషయాలపై అవగాహన కల్పించారు. సర్వ మానవాళి ఒకటేనని తెలిపారు. అనంతరం ఇస్తార్ అల్పాహారం చేశారు. ఇతర మతాలకు చెందిన వక్తలు మాట్లాడుతూ మంచిని పెంచి, చెడును పారద్రోలని ఉద్బోధించారు. ముస్లిం పెద్దలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

కాళ్ల: స్వచ్ఛంద సంస్థలు సామాన్యులకు కంటి వైద్య సదుపాయం కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాలు ఎంతో దోహదపడతాయని, వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ వైద్య సేవల జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ కీర్తి శ్రావణ్ అన్నారు. మండలంలోని బొండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం భీమవరం మానవత సంస్థ ఆధ్వర్యంలో, వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన శరీర అవయువాల్లో నేత్రాలు ప్రధానమైనవని, వాటి విషయంలో నిర్లక్ష్యం చేస్తే శాశ్వతంగా చూపుని కోల్పోతామన్నారు. ఈ శిబిరంలో 160 మంది నేత్ర పరీక్షలు చేయించుకోగా , 78 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించారు. ఆపరేషన్లు 20 మందికి చేయిస్తున్నామని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పెన్మెత్స రామ్మోహన వర్మ (పూనా రాము), బుద్దరాజు వెంకటపతిరాజు, కార్మూరి నరసింహమూర్తి (బాబు), గ్రంధి కుమార వెంకటేశ్వర ప్రసాద్, ఇందుకూరి ప్రసాదరాజు పాల్గొన్నారు.

సేవలందక.. పథకాలు ఇవ్వక

- దిష్టిబొమ్మలుగా సచివాలయాలు
- కూటమి ప్రభుత్వంలో నేటికీ తెరుచుకోని ప్రభుత్వ సేవలు



ఆదరణలేక అలంపురంలో అసంపూర్తిగా ఉన్న సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలు

పెంటపాడు: మహాత్మాగాంధీ కలలో కన్నా గ్రామ స్వరాజ్యం స్థాపనే లక్ష్యంగా మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పల్లెల అభివృద్ధికి పెద్దపీట వేశారు. ప్రజల వద్దకే పాలన ధ్యేయంగా గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసిన దేశ చరిత్రలో సరికొత్త విప్లవాన్ని తీసుకువచ్చారు. మండల కేంద్రాలకు వెళ్లకుండా గ్రామంలోని సచివాలయాల్లో అన్ని సేవలు అందేలా చర్యలు తీసుకుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం..కానీ కూటమి ప్రభుత్వం అంతకంటే మరింతగా ప్రజల వద్దకే పాలన సాగిస్తామంటూ కల్లబొల్లి హామీలతో అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థను పక్కనపెట్టి ప్రజల సేవలకు కోతలు పెట్టింది. అధికారంలోకి వచ్చిన 10నెలలవుతున్నా ఒక్క ప్రభుత్వ పథకం అందక, సచివాలయాల్లో సేవలు అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతునమ్నారు. ప్రజలకు అవసరమైన రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, అన్నదాత సుఖీభవ వంటి వెబ్ సైట్లు ఇప్పటికీ తెరుచుకున్న పాపాన పోలేదు. ప్రజలు ప్రస్తుతం కుల, ఆదాయ, ధ్రువపత్రాలు వన్‌బీ వంటి సాధారణ సేవలు మాత్రమే పొందుతున్నారు. దీంతో ప్రజలు కూటమి ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ సేవలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ప్రజలు పెద్ద ఎత్తున విమర్శిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పల్లెల్లోనే సేవలు అందించేందుకు ప్రతి గ్రామంలోనూ సచివాలయాన్ని ఏర్పాటు చేసి అనుసంధానంగా 50 గృహాలకు ఒక వలంటీర్‌ను నియమించి అన్ని సేవలకు ప్రజలకు నేరుగా అందజేశారు. ఒక్కో సచివాలయ భవనాన్ని రూ.45లక్షలు వెచ్చించి నిర్మించారు. ప్రజలు తమకు వీలున్నప్పుడే సమస్యలు విన్నవించుకునేందుకు సచివాలయాలు ఎంతో ఉపయోగపడేవి. సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్, విద్యుత్ తదితర సేవలు వివిధ ధ్రువపత్రాలు ఆస్తుల రిజిస్ట్రేషన్లు ఆధార్ సేవలు పల్లెల్లోనే పొందేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఈ సేవలు కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాలు వెలవెలబోయాయి. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థను పక్కన పెట్టిన కూటమి ప్రభుత్వం ఉద్యోగులను సైతం తగ్గిస్తోంది.

ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలి

రేషన్‌కార్డుల వెబ్‌సైట్ ఎప్పుడు తెరుస్తారా అని గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. గతంలో సచివాలయాలకు వెళితే సమాధానం లభించేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. గతంలో ఇంటికే వచ్చిన వాలంటీర్ ఏదైనా సమస్య అడిగితే ఉన్నతాధికారులను అడిగి చెప్పేవారు. ప్రస్తుతం ఫింఛన్, రేషన్, కార్డులు ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియక ప్రజలు అల్లాడుతున్నారు.

పట్టించుకునే వారే లేరు



గ్రామాల్లో ఏర్పాటైన సచివాలయాలతో గత ప్రభుత్వంలో ప్రజలకు విస్తృతమైన సేవలు అందేవి. గతంలో వలంటీర్లు ఇంటికి వచ్చి, సంక్షేమ పథకాలు సర్టిఫికెట్లు వంటి సేవలు అందించేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాదిరిగానే ఇప్పుడు కూడా ప్రభుత్వ సేవలను సచివాలయాలు, వలంటీర్ల ద్వారా కొనసాగించాలి. కూటమి ప్రభుత్వం తక్షణమే సూపర్ సిక్స్ పథకాలు అమలుచేయాలి.

– కట్టుబోయిన కృష్ణప్రసాద్, జట్లపాలెం వైఎస్సార్ సీపీ బీసీ సంఘ రాష్ట్ర నాయకుడు

ఏ పథకం అందడం లేదు



గ్రామ సచివాలయ, వలంటీర్ల సేవలు కొనసాగించాలి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 10 నెలలు అయినా ప్రజలకు ఎలాంటి పథకాలు అందడం లేదు. రేషన్‌కార్డులతో పాటు పింఛన్ దరఖాస్తు వెబ్‌సైటు తెరిచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

– దేవరశెట్టి రాంబాబు, కొండేపాడు

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం: పట్టణంలో శీతాల ఉషా కిరణ్ ఏబీఎఫ్ (ఫౌండర్, జనరల్ సెక్రటరీ) ఆత్మబంధువులం సేవా సంఘం తాడేపల్లిగూడెం వారిచే గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ హైదరాబాద్ వారిచే క్యాన్సర్ నిర్ధారణ (స్క్రీనింగ్) పరీక్షలు ఉచితంగా చేయడానికి శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆత్మబంధువులు ఏబీఎఫ్ కడియాల పరశురామయ్య, వి.దుర్గాప్రసాద్, శీతాల ఉషా కిరణ్‌లు వెల్లడించారు. శిబిరంలో ఎక్స్‌రే, మెమోగ్రాఫీ, ప్యాప్స్మియర్ టెస్ట్‌లు చేస్తారన్నారు. శిబిరాలు ఏప్రిల్ 8వ తేదీన ఉంగుటూరులో 9వ తేదీన తాడేపల్లిగూడెంలో షిరిడి సాయిబాబా కల్యాణ మండపంలో, 10వ తేదీన బుట్టాయిగూడెంలోను, 11వ తేదీన నిడదవోలు మండలం పల్లంట్లలో జరుగుతాయని వివరించారు. ఈ సేవా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇరగవరం గ్రామ ఉప సర్పంచ్ రాజీనామా

ఇరగవరం: మండలంలోని ఇరగవరం గ్రామ ఉప సర్పంచ్ బొక్కా సుశీల అనారోగ్య కారణంగా బుధవారం ఉప సర్పంచ్ పదవికి రాజీనామా చేశారు. లేఖను గ్రామ సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, వార్డు సభ్యులు కడలి విజయ కుమార్ సమక్షంలో మండల పరిషత్తు అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌కు అందజేశారు. అదే విధంగా అయినపర్రు గ్రామ సర్పంచ్ సత్తి అఖిల తన పదవికి వ్యక్తిగత కారణంగా రాజీనామా చేశారు. వివరాలను మండల అభివృద్ధి అధికారి వెల్లడించారు.

పేదల సొంతింటి కల నెరవేర్చాలి



ఇళ్ల స్థలాల అర్జీలు పూర్తి చేస్తున్న సీపీఐ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి పేద కుటుంబానికి పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇంటిస్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల కేటాయించాలని, పేదల సొంతింటి కల నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. సీపీఐ, ఏపీ మహిళా సమాఖ్య తాడేపల్లిగూడెం పట్టణ శాఖల ఆధ్వర్యంలో 3వ వార్డులో ఇళ్ల స్థలాల అర్జీలు పూర్తి చేశారు. భీమారావు మాట్లాడుతూ పేదలు సొంత గృహాలు లేవని, అద్దె ఇళ్లకు అద్దెలు కట్టలేక తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. పేదలు ఇళ్ల నిర్మాణాలకు సహకరిస్తే పేద కుటుంబానికి నెలకు 5 వేల నుంచి 6 వేలు వరకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్, పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, మహిళా అధ్యక్షురాలు వడ్డాది మేరీ, కె.ఎస్.పి.ఎస్ జిల్లా అధ్యక్షులు మెరిపో జాన్‌రాజు, నిమ్మకాయల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బలుసులమ్మ గ్రామోత్సవం



అమ్మవారి రథోత్సవం



కోలాట భజన

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది సందర్భంగా పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారిని రథంలో ఉంచి నాల్గోవ రోజు బుధవారం పట్టణ పుర వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. మేళ తాళాలతో, గరగ నృత్యాలతో, తీన్ మార్ డాన్స్‌లతో, కోలాట నృత్యాలను ప్రదర్శించారు. పుర వీధులలో భక్తులు అమ్మవారి రథోత్సవాన్ని తిలకించారు. పూజలు జరిపారు. కార్యక్రమాలను ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు శ్రీరంగం అంజి పర్యవేక్షించారు.

ఎఫ్‌సీఐ కాలనీ నూతన అధ్యక్షుడిగా రంగారావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎఫ్‌సీ కాలనీ రెసిడెంట్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మేడవరపు రంగారావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కె.వి.చలం, శానం లలిత, సెక్రటరీగా ఎం.ఎస్.ఎస్.కె.జనార్దన్, కోశాధికారిగా పరమాత్మ, గౌరవాధ్యక్షుడిగా పూతి నీడి నాగరాజు, ఛీఫ్ అడ్వైజర్‌గా వి.కోటి వీరారావు, గరికపాటి సుబ్రహ్మణ్యశర్మ, కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవమయ్యారు. అనంతరం ఎఫ్‌సీఐ కాలనీలో ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

పేదలకు వైద్యం స్ఫూర్తిదాయకం

తాడేపల్లిగూడెం రూరల్: పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. కూటమి ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని మోదుగ గుంట రామాలయం వద్ద ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రూపు లు లేని గ్రామం మోదుగ గుంట అని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన ఏపూరి సత్యనారాయణ ఇటువంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం హర్షదాయకమన్నారు. అనంతరం గుడ్ సమరిటన్, డాక్టర్ అగర్వాల్, ఆంధ్ర ఆసుపత్రి వైద్యులు జనరల్, కంటి, గుండె వైద్య పరీక్షలు చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వలవల మల్లిఖార్జునరావు(బాబ్జీ), పాల్గొన్నారు.

యువత ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవాలి

భీమవరం: యువత ఉపాధి అవకాశాలు పెంపొందించుకోడానికి చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని జిల్లా పరిశ్రమల శాఖ ప్రమోషనల్ ఆఫీసర్ శ్రీపతి చెప్పారు. బుధవారం పట్టణంలోని గణేష్ ఈసీఈ కంప్యూటర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో ఎస్ఐ–ఎంఎస్ఎంఈ, జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేధో సంపత్తి హక్కులు– ప్రభుత్వ పథకాలు విధి విధానాలపై అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యువత ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పాటు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా పరిశ్రమల స్థాపనకు యువత ముందుకు రావాలన్నారు.

నేడు అత్తిలి ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక



రంభ సుజాత, ఎంపీపీ అభ్యర్థిని



అద్దంకి శ్రీను, వైస్ ఎంపీపీ అభ్యర్థి

అత్తిలి: నేడు అత్తిలి మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక జరుగుతుందని ఎంపీడీవో పి శామ్యూల్ తెలిపారు. గురువారం ఉదయం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులకు ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదువులకు ఖాళీ ఏర్పడటంతో ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎంపీపీ, వైస్ ఎంపీపీ అభ్యర్థులు వీరే..

అత్తిలి మండల పరిషత్ అధ్యక్ష పదవికి అత్తిలి–1 ఎంపీటీసీ సభ్యురాలు రంభ సుజాత, ఉపాధ్యక్ష పదవికి గుమ్మంపాడు ఎంపీటీసీ సభ్యుడు అద్దంకి శ్రీను పేర్లను ఖరారు చేశారు. అత్తిలి మండలంలో మొత్తం ఎంపీటీసీ స్థానాలు ఉండగా వీటిలో గత ఎన్నికలలో వైఎస్సార్ సీపీ 16 స్థానాలు, టీడీపీ 2 స్థానాలు, జనసేన 2 స్థానాల్లో గెలుపొందారు. మండల పరిషత్ అధ్యక్ష పీఠాన్ని వైఎస్సార్ సీపీ దక్కించుకుంది. ఎంపీపీ పదవిని బీసీ జనరల్‌కు రిజర్వు అయింది. ఈపదవిని అత్తిలి–1 ఎంపీటీసీ సభ్యురాలు రంభ సుజాత, తిరుపతిపురం ఎంపీటీసీ సభ్యుడు మక్కా సూర్యనారాయణ ఆశించడంతో పెద్దమనుషుల ఒప్పందం మేరకు చెరో రెండున్నర సంవత్సరాలు పాటు ఎంపీపీగా పనిచేసేందుకు అంగీకారం కుదిరింది. దీంతో మొదటి రెండున్నరేళ్లు ఎంపీపీగా మక్కా సూర్యనారాయణ, మంచిలి, ఈడూరు ఎంపీటీసీ సభ్యులు దారం శిరీషా, సుంకర నాగేశ్వరరావులు వైస్ ఎంపీపీలుగా పని చేశారు. ఒప్పందం మేరకు వీరి పదవీ కాలం పూర్తికావడంతో గతేడాది మక్కా సూర్యనారాయణ, శిరీషాలు రాజీనామాలు చేశారు. 2వ వైస్ ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు ఇన్‌చార్జి ఎంపీపీగా వ్యవహరించారు. మక్కా సూర్యనారాయణ టీడీపీలోకి వెళ్లడంతో కూటమి పార్టీల బలం 5కు చేరింది. వైఎస్సార్‌సీపీకి చెందిన 15 మంది ఎంపీటీసీలలో అత్తిలి–5 ఎంపీటీసీ సభ్యురాలు తండా జ్యోతి గల్ఫ్‌వెళ్లడంతో ప్రస్తుతం వైఎస్సార్ సీపీ అభ్యర్థులు బలం 14 ఉంది. సార్వత్రిక ఎన్నికలు కోడ్‌తో అప్పట్లో నిలిచిపోయిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వ ఆదేశాలు రావడంతో గురువారం ఎన్నికను జరపడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎంపీపీగా రంభ సుజాత, వైస్ ఎంపీపీగా అద్దంకి శ్రీను ఎన్నిక లాంఛనం చేసే పనిలో మాజీ మంత్రికారుమూరి నాగేశ్వరరావు ఉన్నారు.

అత్తిలిలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

అత్తిలి: ఈనెల 28న అత్తిలి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికను ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో డీఈ నరసింహామూర్తి బుధవారం ప్రకటనలో తెలిపారు. సీజీఆర్ఎఫ్, ఏపీఈపీడీసీఎల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ బి సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు బి సురేఖారాణి, ఆర్థిక సమస్యలపై షేక్‌బాబర్‌లు హాజరై విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకుని అక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటారని చెప్పారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈకార్యక్రమం జరుగుతుందని, ఈఅవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని డీఈ నరసింహమూర్తి తెలిపారు.

పన్ను బకాయిలు చెల్లిస్తే వడ్డీలో రాయితీ

తణుకు అర్బన్: ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుల బకాయిలను ఏక మొత్తంలో ఈనెల 31తేదీలోగా చెల్లిస్తే వడ్డీలో 50శాతం రాయితీ ఇవ్వనున్నట్లు మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను బకాయిలను వన్‌టైమ్‌లో చెల్లిస్తే 50శాతం వడ్డీ మాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. పన్ను బకాయిదారులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందు నిమిత్తం సచివాలయాల్లోను, తణుకు పురపాలక సంఘ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లలో పన్ను చెల్లింపులు చేయవచ్చని చెప్పారు. సెలవు రోజుల్లో కూడా పురపాలక సంఘ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు పనిచేస్తాయని వివరించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



మాస్టర్ ట్రైనర్స్ కార్యక్రమం

తాడేపల్లిగూడెం: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కేపీఎన్ ప్రభు కుమార్ పేర్కొన్నారు. నషాముక్త భారత అభియాన్, గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ విశాఖపట్నం, దీక్ష మత్తుమందు బానిసల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం మత్తు పదార్థాలు వినియోగం అనే అంశంపై మాస్టర్ ట్రినర్స్ కార్యక్రమం జరిగింది. ప్రభుకుమార్ మాట్లాడుతూ యువత, ప్రజలందరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. గ్రీన్ వ్యాలీ తరుపున ఉమా రాజుచే మాస్టార్ ట్రైనీస్‌కు శిక్షణ ఇచ్చారు. దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ, దీక్ష మత్తు బానిసల పునరావాస కేంద్రం నిర్వాహకురాలు మల్లిపూడి కనకదుర్గలు మాట్లాడారు. చికిత్స తీసుకుంటున్న వారికి పండ్లు పంచారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ ఈ స్వారాజ్యలక్ష్మి, ఎస్సైలు మురళీ మోహన్‌రావు, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు ప్రశాంతం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పదో తరగతి పరీక్ష బుధవారం ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు ఫిజికల్ సైన్సు పరీక్ష జరిగింది. పట్టణంలో 8 రెగ్యూలర్, ప్రైవేట్ సెంటర్‌లలో జెడ్పీ ఉన్నత పాఠశాల, సుబ్బారావుపేట మునిసిపల్ ఉన్నత పాఠశాల, కడకట్ల కోడే వెంకట్రావు మునిసిపల్ ఉన్నత పాఠశాల, భాష్యం, శ్రీ చైతన్య, నారాయణ, కింబర్లీ, సెంట్ జోన్స్ సెంటర్‌లలోను అదే విధంగా రూరల్ మండలంలో మాధవరం జెడ్పీ పాఠశాల, ఆరుగొలను ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ, కొమ్ముగూడెం జెడ్పీపాఠశాల, పెద్దతాడేపల్లి జెడ్పీ పాఠశాలలోను పెంటపాడు మండలంలోని మీనవల్లూరు, అలంపురం , పెంటపాడు జెడ్పీబీఎస్, జూనియర్ కళాశాలలో పరీక్షలు జరిగాయి. కేంద్రాలు వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పరీక్షకు హాజరుకావాల్సిన వారు మొత్తం విద్యార్థినీ, విద్యార్థులు 3,268 మంది కాగా 3,172 మంది హాజరయ్యారు. 96 మంది హాజరు కాలేదు. స్క్వాడ్ అధికారులు ఆయా కేంద్రాలను తనిఖీలు చేశారు.

పార్టీలకతీతంగా పనిచేయాలి

తాడేపల్లిగూడెం రూరల్: కుల, మత, పార్టీలకతీతంగా అందరూ కలిసికట్టుగా పనిచేసి, గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని ఆరుళ్ల కోదండ రామాలయం వద్ద ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో ప్లాస్టిక్‌ను నిషేధించాలన్నారు. తద్వారా గ్రామంలోని కంపోస్టు యార్డు వందేళ్ల వరకు నిలిచి ఉంటుందన్నారు. ప్రతీ పల్లె సమస్య పరిష్కరించేలా పనిచేస్తామని, తద్వారా మంచి ప్రభుత్వమని నిరూపించుకుంటామన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గ్రామ సర్పంచ్ మాకరాజు వరలక్ష్మి, తహశీల్దార్ ఎం. సునీల్‌కుమార్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, విద్యుత్ ఏఈ రామకృష్ణ, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, వివిధ శాఖల అధికారులు, జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, గ్రామ పెద్దలు మాకరాజు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రబీ వరి కోతలు ప్రారంభం





తాడేపల్లిగూడెం పట్టణ పరిధి నిట్ సమీపంలో యంత్రంతో వరి కోతలు కోస్తున్న దృశ్యం, కోసిన ధాన్యాన్ని రాశిగా పోస్తున్న దృశ్యం

- ఎకరానికి 60 నుంచి 70 బస్తాల దిగుబడులు
- ఆశాజనకంగా దిగుబడులు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ పరిధి ఏపీ నిట్ సమీపంలో రబీ వరి కోతలు ప్రారంభమయ్యాయి. ప్రధానంగా బోర్లపై సాగు కావడంతో జిల్లాలోని ఇతర మండలాలతో పోలిస్తే తాడేపల్లిగూడెంలోనే ముందస్తుగా పంట కోతకొస్తుంది. దీనికి తోడు వరి కంకుల తలలు బరువెక్కి నేలవారడంతో బుధవారం కోతలు ప్రారంభించినట్లు రైతులు చెబుతున్నారు. మరో రెండు రోజుల్లో అమావాస్య ఉండటంతో కొంత మంది రైతులు వరి కోతలు కోసేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాడేపల్లిగూడెం మండలంలో ఈ నెల 31వ తేది తర్వాత, ఏప్రియల్ మొదటి వారంలో వరి కోతలు ఊపందుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. బుధవారం తాడేపల్లిగూడెం పట్టణ పరిధిలో ఎస్ఎల్–10 రకం వరి కంకులను మిషన్‌తో కోశారు. పచ్చిపైనే ధాన్యాన్ని కోసి కమిషన్‌దారులకు విక్రయిస్తున్నట్లు రైతు గోనూరు వీరాస్వామి తెలిపారు. ఎకరానికి 60 నుంచి 70 బస్తాల దిగుబడి వస్తుందన్నారు.

ఆశాజనకంగా దిగుబడులు



జనవరి నుంచి వాతావరణం అనుకూలించడంతో ఎటువంటి చీడపీడలు లేవు. దీంతో పంట ఆరోగ్యంగా పెరగడంతోపాటు దిగుబడులు గణనీయంగా వచ్చాయి. ఎకరానికి రూ.40వేలు వరకు పెట్టుబడి పెట్టాం. ఏడెకరాలు కౌలుకు తీసుకొని సాగు చేశా. పచ్చిపైనే ధాన్యాన్ని కమీషన్‌దారుకు తరలించడం జరిగింది. దిగుబడులు మాత్రం ఆశాజనకంగా ఉన్నాయి.

– గోనూరు వీరాస్వామి, కౌలు రైతు, మెట్ట ఉప్పరగూడెం, తాడేపల్లిగూడెం మండలం

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి



హెల్మెట్‌పై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

భీమవరం: మోటారు సైకిల్స్ ప్రమాదాల్లో ఎక్కువ శాతం తలకు గాయాల వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని, హెల్మెట్ ధరించడం వల్ల పూర్తి రక్షణ లభిస్తుందని భీమవరం ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పట్టణంలోని వీఎస్‌కే డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్మెట్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వాహనాలు నడిపేటప్పుడు లైసెన్స్, ఇన్సూరెన్స్, వెహికల్ డాక్యుమెంట్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు డ్రైవింగ్ చేసే వారేగాకుండా వారికి వెహికల్ ఇచ్చిన గార్డియన్ లేదా తండ్రి కూడా శిక్షార్హులవుతారని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. ప్రయాణం చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ వైవీఎస్ఎన్ మూర్తి అధ్యక్షత వహించగా ట్రాఫిక్ ఎస్ఐ ఎం రామకృష్ణ, విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ భవాని, ట్రాఫిక్ ఏఎస్ఐ దాలయ్య పాల్గొన్నారు.

ఘనంగా అన్నమాచార్య వర్ధంతి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో తాళ్లపాక అన్నమాచార్యుల 522వ వర్ధంతి సందర్భంగా అన్నమాచార్య రచించిన సామాజిక గీతాలాపన నిర్వహించారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో విశ్వహిందూ పరిషత్ పశ్చిమ గోదావరి జిల్లా నల్ల సత్యకృష్ణ కిరణ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా అన్నమాచార్యుల సామాజిక సమరత గురించి వివరించారు. కార్యక్రమంలో ధర్మపరిరక్షణ పట్టణ అధ్యక్షుడు గాదె వెంకన్న, వక్తలు సదాశివరావు, కన్యాకుమారి, ఆలయ కార్య నిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.